


# కరపత్రం

SINCE 2014

బుధవారం సెప్టెంబర్ 02, 2026 | సంపుటి : 2 | సంచిక : 322 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

## రాంచందర్‌రావుకు బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఫోన్

- పార్టీ కార్యాలయంపై దాడులపై నబిన్ ఆరా
- నేతల అరెస్టులపై వివరాలు అడిగిన నితిన్ నబిన్
- కాంగ్రెస్ నిరంకుశ విధానంపై పోరాడాలని సూచన
- బీజేపీ--కాంగ్రెస్ పరస్పర దాడులతో తెలంగాణలో ఉద్రిక్తత
- బీజేపీ కార్యాలయ గేటుకు కాంగ్రెస్ శ్రేణుల నల్లరంగు
- గాంధీభవన్ ముట్టడికి బీజేవైఎం యత్నం
- నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి కార్యాలయంపై దాడి




## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టులో ఊరట

- సింగిల్ జడ్జి తీర్పుపై డివిజన్ బెంచ్ స్టే
- రంగనాథ్‌ను తప్పించాలన్న ఆదేశాలపై తాత్కాలిక సస్పెన్షన్
- శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్ కేసులో కీలక పరిణామం
- డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించిన రంగనాథ్
- రంగనాథ్ తరపున వాదించిన మాజీ సీజే రాజీవ్ శక్దర్




# కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ కీలక భేటీ



దిల్లీ:
ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఇటీవలి రాజకీయ పరిమాణాలపై ఇరువురి మధ్య కీలక చర్చ జరిగినట్లు సమాచారం. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ అంశాలపై వీరిద్దరి మధ్య చర్చ జరగనున్నట్లు సమాచారం. మంత్రి కొండా సురేఖ, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు, వారు ఇచ్చిన వివరణ తదితర అంశాలపై కేసీ వేణుగోపాల్‌తో రేవంత్ చర్చించినట్లు తెలుస్తోంది.

# కలకలం.. మలేరియా మాత్రలు వికటించి ఇద్దరు విద్యార్థులు మృతి




ఎటపాక మండలం గొల్లగూడెం ప్రభుత్వ పాఠశాలలో విషాదం చోటుచేసుకుంది. మలేరియా నివారణలో భాగంగా విద్యార్థులకు సిబ్బంది పంపిణీ చేసిన క్లోరోక్విన్ మాత్రలు వికటించడంతో ఇద్దరు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. పాఠశాలలో మొత్తం 73 మంది విద్యార్థులకు ఈ మాత్రలు పంపిణీ చేయగా, వాటిని మింగిన కొద్దిసేపటికి వారిలో 20 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అప్రమత్తమైన ఉపాధ్యాయులు, స్థానికులు వెంటనే బాధితులను మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరు విద్యార్థులు మృతి చెందగా, మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న అధికారులు పాఠశాలకు చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. విద్యార్థులకు మందుల పంపిణీలో జరిగిన పొరపాటుపై విచారణకు ఆదేశించే అవకాశం ఉంది. ఈ దుర్ఘటనతో విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



# 1000 రోజుల ప్రజాపాలన..

## ఆర్టీసీలో విప్లవాత్మక మార్పులు

### మహిళలకు ఫ్రీ జర్నీ.. రూ.12,167 కోట్ల ఆదా

- 600 బస్సులకు మహిళలే యజమానులు
- 2,932 కొత్త బస్సుల కొనుగోలు
- 1,024 ఈవీ బస్సులు ఇప్పటికే రోడ్డుపై
- హైదరాబాద్‌లో త్వరలో మరో 2,200 ఈవీ బస్సులు
- ఆర్టీసీ ఆక్యుపెన్సీ 67% నుంచి 89%కి
- 1,424 కారుణ్య నియామకాలు.. 4,538 ఉద్యోగాల భర్తీ
- 244 మంది తొలగించిన ఉద్యోగులకు తిరిగి విధులు
- చెక్‌పోస్టుల ఎత్తివేత.. ఎన్‌ఫోర్స్‌మెంట్ బలోపేతం

2 లో

ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతూ టీజీఎస్ఆర్టీసీ దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలుస్తోందన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. తెలంగాణలో ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా... రవాణా శాఖ,ఆర్టీసీ రంగంలో విప్లవాత్మక మార్పులు,సాధించిన విజయాలను పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రభుత్వం కొలువుదీరిన కేవలం 48 గంటల్లోనే మహిళల కోసం అద్భుతమైన మహా లక్ష్మి పథకాన్ని ప్రారంభించాం. ఇప్పటివరకు 347 కోట్ల 36 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించి, దాదాపు రూ. 12,167 కోట్లు ఆదా చేసుకున్నారు. అంతేకాదు, దేశంలోనే మొదటిసారిగా 600 బస్సులకు మహిళలనే యజమానులను చేసి, వారి ఆర్థిక వృద్ధికి బాటలు వేసింది మన ప్రభుత్వం.ప్రయాణికుల సౌకర్యార్థం ఇప్పటివరకు 2,932 కొత్త బస్సులు కొనుగోలు చేశాం. ఇప్పటికే 1,024 ఎలక్ట్రిక్ బస్సులు విజయవంతంగా నడుస్తుండగా... త్వరలోనే హైదరాబాద్ నగరంలో మరో 2,200 కొత్త ఈవీ బస్సులు రోడ్డెక్కబోతున్నాయి. గతంలో 67 శాతంగా ఉన్న ఆక్యుపెన్సీ రేషియో, నేడు 89 శాతానికి పెరిగింది.



## షాదీ ముబారక్‌ల పై హైకోర్టు కీలక ఉత్తర్వులు

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలపై సింగిల్ బెంచ్ విధించిన స్టేను సీజే ధర్మాసనం ఎత్తివేసింది. దీంతో ఈ రెండు పథకాల అమలుకు లైన్ క్లియర్ అయ్యింది.
కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి 2014 నుంచి ప్రభుత్వం జారీ చేసిన ఎనిమిది జీవోలను సవాలు చేస్తూ విజయ్ గోపాల్ అనే న్యాయవాది

2 లో



## నీట్ నిరసనలు.. విద్యార్థులపై కేసులు కొట్టేసిన సుప్రీంకోర్టు

నీట్ నిరసనలకు సంబంధించి దేశవ్యాప్తంగా విద్యార్థులపై నమోదైన కేసులను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఆర్టికల్ 142 కింద విస్తృత అధికారాలను ఉపయోగించి ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసింది. నిరసనలు చేపట్టిన వారిలో తీవ్ర నేర చరిత్ర కలిగి ఉన్న 2,873 మందిపై కొత్తగా కేసుల నమోదుకు కేంద్రం, దిల్లీ పోలీసులకు అనుమతినిచ్చింది.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

- » కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై హరీశ్‌రావు ఫైర్
- » విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం
- » బకాయిలు రాక.. సర్టిఫికెట్లు ఇవ్వని కాలేజీలు
- » ఉద్యోగాలు, పైచదువులకు విద్యార్థులకు ఇబ్బందులు
- » ప్రభుత్వ నిర్లక్ష్యంతో భవిష్యత్తు ప్రశ్నార్థకం
- » ప్రతిపక్షాలపై ప్రచారంపై ఉన్న శ్రద్ధ విద్యార్థులపై లేదా?
- » తక్షణమే బకాయిలు చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్




హైదరాబాద్:
కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేసిన మంచి కంటే సృష్టించిన విధ్వంసమే ఎక్కువ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. దీనికి విద్యార్థుల భవిష్యత్తే ప్రత్యక్ష సాక్ష్యమన్నారు.

## కాంగ్రెస్ అధిష్ఠానం పిలుపు..

# దిల్లీకి కొండా సురేఖ

- కేసీ వేణుగోపాల్‌తో సురేఖ భేటీ
- ఖర్గే అపాయింట్‌మెంట్ కోరిన మంత్రి
- షోకాజ్ నోటీసుల నేపథ్యంలో కీలక పరిణామం
- అధిష్ఠానం నిర్ణయంపై ఉత్కంఠ
- మంత్రివర్గ విస్తరణపై హస్తినలో జోరుగా చర్చ
- మార్పులు, చేర్పులపై అధిష్ఠానం నిర్ణయం?
- దిల్లీకి చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి




హైదరాబాద్:
తెలంగాణ మంత్రి కొండా సురేఖ దిల్లీకి బయల్దేరారు. కాంగ్రెస్ అధిష్ఠానం పిలుపు నేపథ్యంలో ఆమె వెళ్లారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సురేఖ సమావేశం కానున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అపాయింట్‌మెంట్‌ను కూడా ఆమె కోరారు.




# వాయుసేనలో చరిత్ర సృష్టించిన శక్తి శర్మ

- ఎయిర్ వైస్ మార్షల్‌గా తొలి మహిళా అధికారి
- వైద్యేతర విభాగంలో అరుదైన ఘనత
- ఎయిర్ హెడ్‌క్వార్టర్స్‌లో కీలక బాధ్యతలు
- అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ (విద్య)గా బాధ్యతలు
- మూడు దశాబ్దాలకుపైగా విశిష్ట సేవలు
- గతంలోనూ తొలి మహిళా ప్రిన్సిపల్‌గా రికార్డు

భారత వైమానిక దళంలో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. సాయుధ దళాల్లో ఎయిర్ వైస్ మార్షల్ లేదా దానికి సమానమైన హోదాను పొందిన మొట్టమొదటి మహిళా అధికారిగా (వైద్యేతర విభాగంలో) ఎయిర్ వైస్ మార్షల్ శక్తి శర్మ నిలిచారు. వాయుసేన ఈమేరకు 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. మంగళవారం ఆమె దిల్లీలోని ఎయిర్ హెడ్‌క్వార్టర్స్‌లో అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ (విద్య)గా బాధ్యతలు స్వీకరించారని తెలిపింది.

# 1,931 ఏఎన్ఎం పోస్టులు..

## రెండో ప్రొవిజినల్ మెరిట్ లిస్టు విడుదల

తెలంగాణలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్స్ (ఫిమేల్) పోస్టుల భర్తీ ప్రక్రియ తుది దశకు చేరింది.



# హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టులో ఊరట

మొదటిపేజీ తరువాయి

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్ కేసులో ఆయనపై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్ తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. రంగనాథ్‌ను తప్పించి మరో అధికారిని నియమించాలని సింగిల్ జడ్జి గతంలో తీర్పు ఇచ్చారు. దీనిపై రంగనాథ్ డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేశారు. ఆ పిటిషన్‌పై నేడు విచారణ జరిగింది. హైడ్రా కమిషనర్ తరఫున హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు మాజీ సీజే జస్టిస్ రాజీవ్ శక్దర్ వాదనలు వినిపించారు.

# వాయుసేనలో చరిత్ర సృష్టించిన శక్తి శర్మ

మొదటిపేజీ తరువాయి

గతంలో ఆమె ఎయిర్ కమోడోర్ హోదాలో ఉండేవారని పేర్కొంది.శక్తి శర్మ 1994లో ఐఏఎఫ్ విద్యావిభాగంలో నియమితులయ్యారు. వైమానిక దళ శిక్షణ సంస్థలు, ఫీల్డ్ స్టేషన్లు, కమాండ్ హెడ్ క్వార్టర్స్, ఎయిర్ హెడ్ క్వార్టర్స్‌లలో విభిన్న బాధ్యతలు నిర్వర్తించారు. ఐఐటీ కాన్పూర్, పుణె విశ్వవిద్యాలయంలో 'ఐఏఎఫ్ చైర్స్ ఆఫ్ ఎక్సలెన్స్'ను నెలకొల్పడంలో కీలక పాత్ర పోషించారు. త్రివిధ దళాల నుంచి సైనిక పాఠశాలకు ప్రిన్సిపల్‌గా పనిచేసిన మొదటి మహిళా అధికారిగానూ గతంలో చరిత్ర సృష్టించారు. మూడు దశాబ్దాలకుపైగా విశిష్ట సేవలతో ఆమె అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారని వాయుసేన తెలిపింది.

## నీట్ నిరసనలు.. విద్యార్థులపై కేసులు కొట్టేసిన సుప్రీంకోర్టు

మొదటిపేజీ తరువాయి

అదేవిధంగా.. ఆత్మహత్య చేసుకున్న నీట్ విద్యార్థుల కుటుంబాలకు మూడు నెలల్లోగా పరిహారం అందించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో సెప్టెంబర్ 5న నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విరమించుకుంటున్నట్లు సర్వోన్నత న్యాయస్థానానికి కాక్రోచ్ జనతా పార్టీ తెలిపింది.

సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన సుప్రీం ధర్మాసనం ఎదుట ఈ అంశంపై వాదనలు సాగాయి. జులై 20-25 మధ్య దేశవ్యాప్తంగా నీట్ నిరసనకారులపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌లను రద్దు చేసేందుకు సుప్రీంకోర్టు తన అధికారాలను ఉపయోగించాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరారు. నీట్ రద్దు అనంతరం ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లిస్తామంటూ సీజేపీ ప్రతినిధులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు కేంద్రం కట్టుబడి ఉందని, దీనికి సంబంధించిన విధివిధానాల ఖరారుకు మూడు నెలల సమయం కోరారు. దీనికి అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఆ కేసులను కొట్టేసింది.

# 1000 రోజుల ప్రజాపాలన.. ఆర్టీసీలో విప్లవాత్మక మార్పులు

మొదటిపేజీ తరువాయి

ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే మా ధ్యేయం. సర్వీసు నుంచి తొలగించబడిన 244 మంది ఉద్యోగులను ప్రత్యేక కమిటీ ద్వారా తిరిగి విధుల్లోకి తీసుకున్నాం. కారుణ్య నియామకాల కింద 1,424 ఉద్యోగాలు ఇచ్చాం. అలాగే 4,538 ఉద్యోగాల నియామక ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతోంది.టీఎస్ నుంచి టీజీ గా మార్పులు చేసుకుంటూ... వాహన్ ఁ సారథి విధానాన్ని తెచ్చాం. రవాణా శాఖలో అవినీతికి తావులేకుండా చెక్‌పోస్టులను ఎత్తివేసి, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను బలోపేతం చేశాం.

సీఎం రేవంత్ నాయకత్వంలో, డిప్యూటీ సీఎం,ప్రజా ప్రతినిధుల సహకారంతో... గ్రామ స్థాయి నుంచి పట్టణాల వరకు మెరుగైన రవాణా సేవలను అందిస్తున్నాం. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి, ప్రయాణికుల భద్రత మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని అన్నారు పొన్నం.

## కాంగ్రెస్ అధిష్ఠానం పిలుపు..

# ఢిల్లీకి కొండా సురేఖ

మొదటిపేజీ తరువాయి

ఇటీవల గీసుకొండలో సీఎం రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. కుమార్తె వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ (డీఏసీ) షోకాజ్ నోటీసులు ఇచ్చింది. కమిటీ ఛైర్మన్ మల్లు రవికి ఆమె వివరణ ఇచ్చారు. అనంతరం కొండా సురేఖతో పాటు వనపర్తి వ్యవహారంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన నివేదికను అధిష్ఠానానికి టీపీసీసీ పంపింది. ఈ పరిణామాల నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ ఢిల్లీకి వెళ్లడం.. ఆమె విషయంలో అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననే ఉత్కంఠ నెలకొంది.

**మంత్రివర్గ విస్తరణపై జోరుగా ప్రచారం..**

తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై హస్తినలో జోరుగా ప్రచారం జరుగుతోంది. మంత్రివర్గంలో మార్పులు, చేర్పులపై కాంగ్రెస్ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకోవచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. నామినేటెడ్ పదవుల భర్తీపైనా నిర్ణయం ఉండే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మంత్రివర్గ విస్తరణ, పదవుల పంపకాల ప్రచారం నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యనేతలు దిల్లీ బాటపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి కొద్దిసేపటి క్రితమే దిల్లీ చేరుకున్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే అక్కడ ఉన్నారు. అయితే పలువురు నేతలు మాత్రం బుధవారం స్వామినాథన్ ఫౌండేషన్‌కి వైఎస్ అవార్డు ప్రదాన కార్యక్రమం కోసం దిల్లీ వెళ్తున్నట్లు చెబుతున్నారు.

# 1,931 ఏఎన్‌ఎం పోస్టులు.. రెండో ప్రొవిజినల్ మెరిట్ లిస్టు విడుదల

మొదటిపేజీ తరువాయి

మొత్తం 1,931 పోస్టుల భర్తీకి సంబంధించి మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మంగళవారం సాయంత్రం రెండో ప్రొవిజినల్ మెరిట్ లిస్ట్‌ను విడుదల చేసింది. 1:1.25 నిష్పత్తిలో అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసింది. ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 16 నుంచి 26వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ అనంతరం తుది మెరిట్ లిస్ట్, సెలక్షన్ జాబితాలను విడుదల చేస్తారు.

ఈ పోస్టుల భర్తీ కోసం 2023 జులై 26న ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఏడాది మే 14న ప్రొవిజినల్ లిస్ట్ విడుదల చేసి అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం జులై 10న తొలి తాత్కాలిక మెరిట్ జాబితాను విడుదల చేశారు. మరోసారి అభ్యంతరాలను స్వీకరించి వాటిని పరిశీలించాక తాజాగా రెండో తాత్కాలిక జాబితాను విడుదల చేశారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం అభ్యర్థులు హైదరాబాద్‌లోని వెంగళరావునగర్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌కు వెళ్లాల్సి ఉంటుంది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఈ నెల 28వ తేదీని రిజర్వ్‌డేగా నిర్ణయించారు. తమకు కేటాయించిన తేదీన వెరిఫికేషన్‌కు హాజరు కాలేకపోయిన వారు ఆ రోజు వెళ్లే అవకాశం కల్పించారు.

# రాంచందర్‌రావుకు పార్టీ జాతీయ అధ్యక్షుడి ఫోన్

మొదటిపేజీ తరువాయి

తెలంగాణలో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ అన్న చందంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఫోన్ చేశారు. పార్టీ కార్యాలయంపై దాడులు, నేతల అరెస్ట్‌లపై ఆరా తీశారు. అదే సమయంలో కాంగ్రెస్ నిరంకుశ విధానంపై పోరాటాన్ని కొనసాగించాలని రాంచందర్‌రావుకు నబిన్ సూచించారు.

కాగా, తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల దాడులు, నిరసనలతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. నిన్న(సోమవారం, ఆగస్టు 31వ తేదీ) బీజేపీ రాష్ట్ర కార్యాలయ గేటుకు కాంగ్రెస్ శ్రేణులు నల్లరంగు వేయగా, ప్రతిగా నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి కార్యాలయంపై బీజేపీ శ్రేణులు దాడికి దిగాయి. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేపై, బిహార్‌లో విద్యార్థులపై బీజేపీ వ్యవహరించిన తీరును నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించారు.

బీజేపీ రాష్ట్ర కార్యాలయ గేటుకు యూత్ కాంగ్రెస్ శ్రేణులు నల్ల రంగు పూయడంపై బీజేవైఎం శ్రేణులు మండిపడ్డారు. దీనిని నిరసిస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో గాంధీభవన్ ముట్టడికి యతి?ంచారు. గాంధీభవన్‌పై కోడ్డిగుడ్లు విసిరేసి నిరసన వ్యక్తం చేశారు. నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ శ్రేణులను పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి.

బీజేపీ, కాంగ్రెస్ పరస్పర నిరసన దాడులతో నల్లగొండ జిల్లా కేంద్రం అట్టుడికింది. శ్రీనగర్ కాలనీలో ఉన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంపై (వ్యక్తిగత కార్యాలయం) సోమవారం బీజేపీ జిల్లా అ్యధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నేతృత్వంలో కోడి గుడ్లు, టమాటాలతో దాడి చేశారు. అక్కడే ఉన్న మంత్రి ప్లెక్సీకి నిప్పంటించారు. దీంతో మాజీ మున్సిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో దేవరకొండ రోడ్డు చైతన్యపురికాలనీలో ఉన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నివాసంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడిచేశారు.

# పేపర్ లీకేజీ కేసులో..అడ్డంగా దొరికిన ఏడో ర్యాంకర్




మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ (గ్రూప్-బి) పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ కేసులో సంచలనం వెలుగుచూసింది. ఈ కేసులో తాత్కాలిక మెరిట్ జాబితాలో ఏడో ర్యాంకు సాధించిన రుతుజా పాటిల్‌ను ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు నందుర్బార్‌లో అరెస్ట్ చేశారు. దీంతో ఈ కుంభకోణంలో అరెస్టయిన వారి సంఖ్య ఏడుకి చేరింది.

పరీక్షకు ముందే రుతుజా పాటిల్‌కు లీకైన ప్రశ్నపత్రం అందిందని పోలీసులు తెలిపారు. అయితే, అధికారులకు ఎలాంటి అనుమానం రాకుండా ఉండాలనే ప్లాన్‌తో.. కావాలనే 10 ప్రశ్నలకు తప్పు సమాధానాలు రాయాలని నిందితులు ఆమెకు సలహా ఇచ్చినట్లు విచారణలో తేలింది. కోర్టులో హాజరుపరిచిన అనంతరం రుతుజాను పోలీసులు కస్టడీకి తీసుకున్నారు.

మార్చి 22న మహారాష్ట్ర వ్యాప్తంగా ఆరు డివిజనల్ కేంద్రాల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ స్క్రీనింగ్ పరీక్ష ఆఫ్‌లైన్‌లో జరిగింది. జూన్ 12న వెలువడిన ఫలితాల్లో 506 మంది ఇంటర్వ్యూలకు అర్హత సాధించగా, జూలైలో ఇంటర్వ్యూలు పూర్తయ్యాయి. అయితే, పరీక్షలో అక్రమాలు జరిగాయంటూ జూలై 22 నుంచి 26 మధ్య అభ్యర్థులు, ప్రజాప్రతినిధుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. లీకైన ప్రశ్నపత్రాలు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా సర్క్యులేట్ అయినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో అప్రమత్తమైన ఎంపీఎస్సీ మొత్తం రిక్రూట్‌మెంట్ ప్రక్రియను రద్దు చేస్తున్నట్లు ప్రకటించి, పారదర్శకత కోసం త్వరలో మళ్లీ పరీక్ష నిర్వహిస్తామని స్పష్టం చేసింది.

ఈ పేపర్ లీక్ కుంభకోణంలో ఇప్పటికే ముగ్గురు ఎంపీఎస్సీ అధికారులతో పాటు మొత్తం ఆరుగురిని క్రైమ్ బ్రాంచ్ అరెస్ట్ చేసింది. విశ్వేశ్వర్ దత్తాత్రేయ నకాతే (ఎంపీఎస్సీ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్),గోపాల్ భట్టు మరాఠే (ఎంపీఎస్సీ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్) అభిజీత్ గణపత్రావ్ లెంద్వే (ఎంపీఎస్సీ అండర్ సెక్రటరీ),ప్రవీణ్ దిలీప్ పాటిల్ (కౌటిల్య అకాడమీ డైరెక్టర్),అమృత్ నామ్‌దేవ్ పాటిల్, లోకేష్ అలియాస్ గౌరవ్ రాజేంద్ర పాటిల్ (సహ నిందితులు),నిందితులంతా కలిసి పరీక్షకు ముందే ప్రశ్నలను సేకరించి, ప్రత్యేక సెట్‌గా తయారు చేసి అనధికార వ్యక్తులకు చేరవేసినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం ఈ కేసులో అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

# బెర్త్ బుక్ చేసినా.. పడుకోకూడదు!




రైలు ప్రయాణంలో మిడిల్ బెర్త్, లోయర్ బెర్త్ ప్రయాణికుల నడుమ వివాదాలు రావడం సర్వసాధారణం. ఇటీవల సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే ఒక రైలులో జరిగిన సంఘటనే దీనికి ఉదాహరణ. సురేష్ అనే ప్రయాణికుడు లోయర్ బెర్త్ బుక్ చేసుకోగా, రమేష్ అనే వ్యక్తి మిడిల్ బెర్త్ బుక్ చేసుకున్నాడు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో రమేష్ తన మిడిల్ బెర్త్‌ను ఓపెన్ చేసి పడుకుంటానని పట్టుబట్టగా లోయర్ బెర్త్‌లో కూర్చోవాలనుకున్న సురేష్ దానికి నిరాకరించాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి టీటీఈ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో భారతీయ రైల్వే నిబంధనలు స్పష్టమైన మార్గదర్శకాలను అందిస్తున్నాయి.

**రైల్వే నిబంధనలు - వేళలు**

రాత్రి పూట 10:00 నుంచి ఉదయం 6:00 వరకు నిద్రపోయే వేళగా రైల్వే వర్గీకరించింది. ఈ సమయంలో మిడిల్ బెర్త్ ప్రయాణికుడు తన బెర్త్‌ను తెరచి పడుకునే పూర్తి హక్కు కలిగి ఉంటాడు. పగటి పూట అంటే ఉదయం 6:00 నుంచి రాత్రి 10:00 వరకు సీటింగ్ (కూర్చోవడానికి) కోసం కేటాయించారు.

ఈ సమయంలో మిడిల్ బెర్త్‌ను తప్పనిసరిగా కిందకు దించి ఉంచాలి (ఫోల్డ్ చేయాలి). మిడిల్ బెర్త్, అప్పర్ బెర్త్ ప్రయాణికులు లోయర్ బెర్త్‌పై కూర్చోవడానికి అవకాశం ఇవ్వాలి. పైన పేర్కొన్న ఉదాహరణలో మధ్యాహ్నం 2 గంటలకు మిడిల్ బెర్త్ తెరవాలని రమేష్ కోరడం రైల్వే నిబంధనలకు విరుద్ధం. సురేష్ ఆ సమయంలో లోయర్ బెర్త్‌పై కూర్చునే హక్కు కలిగి ఉంటాడు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల మధ్య మిడిల్ బెర్త్ ప్రయాణికుడు పడుకోవాలని భావిస్తే అది లోయర్ బెర్త్ ప్రయాణికుడి పరస్పర అంగీకారంతో మాత్రమే జరగాలి.

అలాగే, గర్భిణులు, వయోవృద్ధులు లేదా అనారోగ్యంతో ఉన్న ప్రయాణికులకు అనధికారికంగా సీట్లు సర్దుబాటు చేసుకోవడంలో తోటి ప్రయాణికులు మానవత్వంతో సహకరించాలని రైల్వే కోరుతోంది. ఒకవేళ ఏకాభిప్రాయం కుదరకపోతే టీటీఈ దృష్టికి తీసుకెళ్తే ఆయన నిబంధనల ప్రకారం సమస్యను పరిష్కరిస్తారు. ప్రయాణికులు ఈ ప్రాథమిక నిబంధనలు తెలుసుకోవడం వల్ల అనవసర గొడవలను నివారించి సుఖవంతమైన ప్రయాణాన్ని సాగించవచ్చు.

# ఈసారి లక్షా 40 వేల గణేష్ మండపాలు



ఈసారి భాగ్య నగర పరిధిలో లక్షా నలభై వేల గణేష్ మండపాల సిద్ధమవుతున్నాయని భాగ్యనగర్ ఉత్సవ కమిటీ స్పష్టం చేసింది. ఈ మేరకు వాటి నిమజ్జనాలకు అవసరమయ్యే ఏర్పాట్లను చేయాలని ప్రభుత్వాన్ని కోరామని తెలిపింది. బడ్జెట్ కేటాయిపులో ప్రభుత్వం స్పీడ్ పెంచాలని మంత్రి దృష్టికి తీసుకెళ్ళామని, ఎప్పటిలాగే అన్నీ చెరువులు, వినాయక సాగర్‌లో నిమజ్జనం కొనసాగుతుందని బాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రావి నూతుల శశిధర్ సాక్షి టీవీకి తెలిపారు.

'అధికారుల తప్పుడు నివేదిక కారణంగా హైకోర్టు వినాయక సాగర్‌పై స్టే ఇచ్చింది. ఎక్కడ వినాయక నిమజ్జనం వల్ల పొల్యూషన్ జరిగినట్లు సరైన ఆధారాలు లేవు. కావాలనే కొందరు అధికారులు హిందూ పండుగలను ఆంక్షలు పెట్టాలని చూస్తున్నారు. కాప్రా చెరువుతో పాటు హైడ్రా డెవలప్ చేసిన అన్నీ చెరువుల్లో నిమజ్జనం చేస్తాం.

అడ్డుకోవడానికి హైడ్రాకు ఎలాంటి అధికారం లేదు. చెరువులకు ఓనర్లు ప్రజలు.. అధికారులు, నాయకులు కాదు. చెరువుల్లో నిమజ్జనం చేయడం మా సంప్రదాయం. అందుకే అన్నీ చెరువుల్లో నిమజ్జనం కొనసాగిస్తాం. అడ్డుకోవాలని చూస్తే.. పరిణామాలు మరోలా ఉంటాయి' అని పేర్కొన్నారు.

## షాదీ ముబారక్‌ల పై హైకోర్టు కీలక ఉత్తర్వులు

మొదటిపేజీ తరువాయి

హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడంతో, విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి పథకాల అమలుపై మధ్యంతర స్టే విధించారు.

సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఈ పథకాలు 2014 నుంచి నిరంతరాయంగా అమలవుతున్నాయని, పిటిషనర్ లబ్ధిదారుడు కానందున ఆయనకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని కోర్టుకు తెలిపారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని, ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలపై దాఖలైన ఇలాంటి వ్యాజ్యాలను డివిజన్ బెంచ్ మాత్రమే విచారించాలని వాదించారు. షాదీ ముబారక్ వంటి పథకాలకు సుప్రీంకోర్టు కూడా గతంలో అనుమతినిచ్చిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

అడ్వకేట్ జనరల్ వాదనలతో ఏకీభవించిన డివిజన్ బెంచ్, సింగిల్ జడ్జి ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఎత్తివేస్తూ తీర్పునిచ్చింది. హైకోర్టు తాజా నిర్ణయంతో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలు రాష్ట్రవ్యాప్తంగా యథావిధిగా కొనసాగనుంది.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను వేధిస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనకు నేటితో వెయ్యి రోజులు పూర్తయ్యాయని పేర్కొంటూ 'ఎక్స్'లో హరీశ్‌రావు పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌పై విమర్శలు గుప్పించారు."ప్రతిపక్షాలపై అసత్యాలు ప్రచారం చేయడంపై ఉన్న శ్రద్ధ.. క్షేత్రస్థాయిలో పిల్లలు పడుతున్న గోస మీద ఎందుకు లేదు? ప్రభుత్వం ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీలు విద్యార్థులను వేధిస్తున్నాయి. కష్టపడి చదువుకున్నా సర్టిఫికెట్లు చేతికి రాక.. అటు ఉద్యోగాలకు, ఇటు పైచదువులకు వెళ్లలేక వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం సెప్టెంబర్ 02, 2026

## రాహుల్ గాంధీ అసలు మనుస్మృతి చదివాడా?

# కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే దళితుడు కాదా!

శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్

ఒక్కోసారి మన ఎత్తుగడలే మనల్ని దెబ్బతీస్తాయి. సరైన సమాచారం లేని రాజకీయ ఆటలు బెడిసి కొడతాయి అంటూ ప్రముఖ జర్నలిస్ట్ ప్రదీప్ సింగ్ అంటున్నారు.

ఒక్కోసారి మాత్రమే కాదు, ఎప్పుడైనా సరే సమాచారం లేకుండా మీరు ఏదైనా ఒక విషయంలోకి దూకినా లేదా ఒక అంశాన్ని లేవనెత్తినా, ఎదురుదెబ్బ తగులుతుంది.

▪ ఈ పోలిక రాహుల్ గాంధీకి పూర్తిగా వర్తిస్తుంది.'వందేమాతరం' లోని మిగిలిన నాలుగు చరణాలలో ఏముంది, వాటి అర్థం ఏమిటి, వాటిని ఎందుకు చదవాలి అనే విషయాల గురించి ఆయనకు ఎలాంటి అవగాహన లేదు.ఆ నాలుగు చరణాలలో అంత ఆక్షేపణీయమైనది ఏముందో చెప్పమని అడిగితే ఆయన చెప్పలేరు.

వారికి తెలిసిందల్లా ఒక్కటే, ఈ నాలుగు చరణాలపై ముస్లింలకు అభ్యంతరం ఉంది, జిన్నాకు అభ్యంతరం ఉండేది. జిన్నా వందేమాతరం ముస్లింల విశ్వాసాలకు వ్యతిరేకం అని ఆ గీతాలాపనను ఆపించారు అని మాత్రమే రాహుల్ గాంధీకి తెలుసు.

నిజానికి జిన్నాకు మొదట ఉన్న రెండు చరణాలపై కూడా అభ్యంతరం ఉండేది.

▪ జిన్నాకు హిందువులు ఉండటంపైనే అభ్యంతరం ఉండేది, పైగా ఇస్లాం ప్రకారం కాఫిర్‌లకు జీవించే హక్కే లేదు అని అంటారు. ఈ విషయాలన్నీ రాహుల్ గాంధీకి తెలియవు, ఒకవేళ ఎవరైనా చెప్పినా ఆయన నమ్మడానికి సిద్ధంగా లేరు.

**ఆయన 'మనుస్మృతి'ని ఎప్పుడూ చదవలేదు, మనుస్మృతిలో ఏముందో ఆయనకు తెలియదు.**

▪ మనుస్మృతి అనేది హిందువుల పవిత్ర మత గ్రంథం ఏమీ కాదు.

**హిందూ మతం అనేది 'వన్ బుక్ రిలీజియన్' కాదు.హిందూమతం ఒకే పుస్తకం ఆధారంగా నడవదు. అసలు సనాతన హిందూ మతానికి పుస్తకాలు ఆధారం కాదు.**

▪ ఇస్లాం మతం ఒకే పుస్తకం ఖురాన్ ఆధారంగా నడుస్తుంది....క్రైస్తవ మతం కూడా ఒకే పుస్తకం బైబిల్ ఆధారంగా నడుస్తుంది.

ఈ విషయం రాహుల్ గాంధీకి అర్థం కాదు, ఎందుకంటే ఆయన తన కుటుంబంలో క్రిస్టియానిటీని చూశారు, పార్సీ మతాన్ని చూశారు. తన పార్టీ రాజకీయాలలో ఇస్లాంను చూశారు. ఇంకా చెప్పాలంటే హిందూ వ్యతిరేక సెక్యులరిజాన్ని చూశారు.

**రాహుల్ గాంధీ హిందుత్వాన్ని, హిందూ మతాన్ని, సనాతన ధర్మాన్ని ఆయన అసలు చూడనే లేదు. ఒకవేళ చూసినా, ఎప్పుడూ ద్వేష భావంతోనే చూశారు.**

▪ సనాతన హిందూ ధర్మములో ఏదైనా మంచి ఉండవచ్చు అనే ఆలోచన ఆయన ఊహకు కూడా అందని విషయం. అందుకే దాని గురించి ఎప్పుడు మాట్లాడినా వ్యతిరేకంగానే మాట్లాడుతుంటారు. హిందువులను ఎంతగా దూషిస్తే అంతగా ప్రజాదరణ పెరుగుతుందని ఆయన భావిస్తారు.ఈ దారిలో నడిచి కాంగ్రెస్ ఎక్కడికి చేరింది, రాహుల్ గాంధీ ఎక్కడికి చేరారు అనేది ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

అకస్మాత్తుగా ఇప్పుడు వారికి దళితులపై ఆందోళన మొదలైంది. వారి పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆగస్టు 8 న హల్ద్వానీ వెళ్లారు.అక్కడ రాంలీలా మైదానంలో ఆయన సభ, కార్యక్రమం జరిగింది.

**అక్కడే సనాతన హిందు వ్యతిరేక నినాదాలు, ఇస్లాంకు అనుకూల నినాదాలు చేశారు.**

▪ అది హిందూ ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాలు జరిగే రాంలీలా మైదానం అది.

**వారి కార్యక్రమం ముగిసిన తర్వాత కొందరు వ్యక్తులు ఆ మైదానాన్ని 'శుద్ధీకరణ' (పవిత్రం) చేశారు.ఇక్కడ హిందూ వ్యతిరేక, సనాతన వ్యతిరేక నినాదాలు వచ్చాయి కాబట్టి శుద్ధీకరణ అవసరమని వారు భావించారు.**

▪ ఇది చాలా పెద్ద అవకాశమని రాహుల్ గాంధీ అనుకున్నారు. ఒకటి మల్లికార్జున ఖర్గే కులం, రెండు శుద్ధీకరణ.

ఈ రెండు విషయాలు మాత్రమే ఆయనకు బుర్రకెక్కాయి.

**కానీ ఈ విషయంలో కూడా ఆయనకు ఎంత ఆలస్యంగా జ్ఞానోదయం అయిందంటే... ఆగస్టు 8న జరిగిన ఈ ఉదంతాన్ని ఆయన 20 రోజుల తర్వాత లేవనెత్తారు.**

సభలో మల్లికార్జున ఖర్గే స్వయంగా ఈ విషయాన్ని ప్రస్తావించినప్పుడు కూడా దీని వల్ల వచ్చే రాజకీయ ప్రయోజనం ఏమిటో రాహుల్ గాంధీకి అర్థం కాలేదు.

**ఖర్గే మాటలలో హిందూ వ్యతిరేకతను రాహుల్ గాంధీ స్వాగతించారు.**

▪ **అసలు విషయం ఏమిటంటే, మొదటి ప్రశ్న...మల్లికార్జున ఖర్గే దళితుడేనా? ఈ విషయం స్పష్టం కావాలి. ఎందుకంటే చాలా సామాజిక మాధ్యమాలలో, ఇతర మీడియా వేదికల్లో మల్లికార్జున ఖర్గే హిందూ మతాన్ని వదిలి బౌద్ధమతాన్ని స్వీకరించారని, ఆయన**

**బౌద్ధమతాన్ని ఆచరించే వ్యక్తి అని, అతను ఒక ప్రాక్టీసింగ్ బుద్ధిస్ట్ అని వార్తలు వస్తున్నాయి.**

**మరి అలాంటప్పుడు ఖర్గే దళితుడనే ప్రశ్న ఎక్కడి నుండి వస్తుంది?**

దళితుడు కాకపోయినా సరే, ఎవరికీ అవమానం జరగకూడదు, అది దళితులైనా కాకపోయినా సరైనది కాదు.

కానీ ఇందులో దళితులను అవమానించడం ఎక్కడ ఉంది?

అయితే .. రాహుల్ గాంధీకి ఏ అంశమూ దొరకనప్పుడు, ఈ పాత విషయాన్ని దుమ్ము దులిపి పైకి లేపాలనిపించింది.

అందుకే ఈ అంశాన్ని లేవనెత్తి, బిజెపి దళితులను అవమానిస్తోందని, మల్లికార్జున ఖర్గే దళితుడు కాబట్టే ఆయన కార్యక్రమం జరిగిన చోట శుద్ధీకరణ చేస్తున్నారని ఆరోపించారు.

ఆ శుద్ధీకరణ చేస్తున్న వారు ఎవరు, ఎందుకు చేస్తున్నారు, వారి ఉద్దేశం ఏమిటి, వారి ఫిర్యాదు ఏమిటి అనే కనీస సమాచారాన్ని తెలుసుకునే ప్రయత్నం కూడా రాహుల్ గాంధీ చేయలేదు.

▪ **ఇప్పుడు కథ అడ్డం తిరిగింది, రాహుల్ గాంధీ లేవనెత్తిన అంశం ఎదురుదెబ్బ కొట్టింది.ఆ శుద్ధీకరణ చేసిన వారిలో దళిత యువకులు ఉన్నారు. వారిలో ప్రధాన ఫిర్యాదుదారుడు దళితుడు. అతడు వాల్మీకి' సామాజిక వర్గానికి (కులానికి) చెందిన అమిత్ కుమార్, జవహర్ నగర్ కాలనీ నివాసి. అతను ఎస్సీ/ఎస్టీ (SC/ST Act) చట్టం కింద రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ (FIR) నమోదు చేయించాడు.**

రెండు వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టారని, దళితులను అవమానించారని ఆయన ఫిర్యాదు చేశాడు.

నేను స్వయంగా దళితుడినై ఉండి, ఒక దళితుడికి వ్యతిరేకంగా ఇలాంటి శుద్ధీకరణ కార్యక్రమం చేసి దళితులను అవమానించానని అనడం నన్ను దూషించడమే అని ఆ యువకుడు పేర్కొన్నాడు.

**ఇప్పుడు కాంగ్రెస్‌కు అర్థమైంది వ్యవహారం రివర్స్ అయిందని, అంటే 'ఉల్టే బాస్ బరేలీ కో లద్ గయే'.ఆశ చెడిన తర్వాత అనుభవం**




**వచ్చింది.**

**ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ పూర్తిగా మేల్కొంది. ఉత్తరాఖండ్‌లోని ప్రతి జిల్లాలోనూ ఎఫ్ఐఆర్ నమోదు చేయిస్తామని ప్రకటనలు చేస్తోంది.**

మరి మల్లికార్జున ఖర్గే ఈ అంశాన్ని లేవనెత్తినప్పుడే మీరు ఎందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేయించలేదు? సంఘటన జరిగిన 20 రోజుల తర్వాత గుర్తుకొచ్చిందా?.

▪ ఆ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఉంది కాబట్టి పోలీసులు కాంగ్రెస్ ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయనివ్వలేదని అనుకుందాం.పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయనప్పుడు బాధితుడు కోర్టు తలుపులు తడతాడు. మనదేశంలో ఇటువంటి ఉదాహరణలు కోకొల్లలుగా ఉన్నాయి.

కోర్టు ఆదేశాల మేరకు ఎఫ్ఐఆర్ నమోదవుతుంది. కొన్నిసార్లు కోర్టు ఆదేశాల ద్వారా 'జీరో ఎఫ్ఐఆర్' (Zero FIR) కూడా నమోదవుతుంది.

అంటే మీరు ఏ కోర్టుకు వెళ్లారో, దానికి సంబంధించిన పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదై, ఆ తర్వాత కేసు పరిధిలోకి వచ్చే స్టేషన్‌కు బదిలీ చేయబడుతుంది.

▪ కాంగ్రెస్ ఆ మార్గాన్ని కూడా ఎంచుకోలేదు. అంటే వారు ఈ సమస్యపై తీవ్రంగా లేరు, కేవలం ఉపన్యాసాలు దంచి, తాము దళితుల గురించి ఎంతగానో తపించిపోతున్నామని చూపించుకోవడమే వారి ఉద్దేశం.

**ఈ క్రమంలో రాహుల్ గాంధీ కాగితపు గ్లాసు (Paper Cup) కు కూడా కులాన్ని వెతికారు.**

▪ హిందువులు ఎస్సీ/ఎస్టీ వర్గాల వారికి కాగితపు గ్లాసుల్లో టీ ఇస్తారని, తాము మాత్రం వేరే పాత్రల్లో టీ తాగుతారని హిందువులపై దాడి చేస్తూ మాట్లాడారు. ఆయన ఈ ప్రకటన విడుదల చేసిన వెంటనే, ఆయన సొంత కార్యాలయానికి సంబంధించిన ఒక ఫోటో బయటకు వచ్చింది.

**అందులో రాహుల్ గాంధీ సిరామిక్ కప్పులో టీ తాగుతుంటే, ఆయన పక్కన కూర్చున్న మిగిలిన వారంతా కాగితపు కప్పుల్లో టీ తాగుతున్నారు.**

రాహుల్ భయ్యా, మీరు చెప్పేది ఏదైనా ఉంటే, మొదట దానిని మీ జీవితంలో ఆచరించండి. పొద్దున, సాయంత్రం గాంధీజీ పేరు జపిస్తుంటారు కదా. ఎవరికైనా ఏదైనా వద్దు అని చెప్పేముందు, మొదట దానిని మనం ఆచరించాలని గాంధీజీ నమ్మేవారు.

ఒకరు బెల్లం తినే అలవాటు మాన్పించమని అడిగితే, గాంధీజీ మొదట స్వయంగా బెల్లం తినడం మానేసి, ఆ తర్వాతే అవతలి వ్యక్తికి మానమని చెప్పారు. కానీ రాహుల్ గాంధీకి ఇవన్నీ చాలా పెద్ద విషయాలు.

**రాహుల్ గాంధీ స్టేజీపై నిలబడి, అటూ ఇటూ తిరుగుతూ ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టడానికి, నలుగురైదుగురిని కూర్చోబెట్టి ప్రశ్నలు అడిగించడానికి ఏదో ఒక అంశం కావాలి అంతే.**

ఒకవేళ పొరపాటున ఆయనకు నచ్చని ప్రశ్న ఏదైనా వస్తే, వెంటనే ఇది 'బిజెపి అడిగించిన ప్రశ్న' అంటారు. ఒకవేళ అది బిజెపి ప్రశ్నే అనుకుందాం, దానికి సమాధానం చెప్పండి లేదా సమాధానం చెప్పడం ఇష్టం లేదని అనండి. కానీ రాహుల్ గాంధీ ఆ విలేఖరి యొక్క కులాన్ని అడగటం మొదలుపెడతారు.

**కానీ తన కులం ఏమిటో ఎప్పుడూ చెప్పరు.ఇప్పుడు రాంలీలా మైదానంలో శుద్ధీకరణ కార్యక్రమం చేసిన వారిలో ఒక యువకుడు దళితుడు కావడంతో, అతని ఎఫ్ఐఆర్ వల్ల రాహుల్ గాంధీ చిక్కుల్లో పడ్డారు.**

▪ ఇప్పుడు పోలీసులు ఏం చేస్తారనే దానిపై దేశం అంతా దృష్టి పెట్టింది. సాధారణంగా ఎస్సీ/ఎస్టీ చట్టం కింద కేసు నమోదైతే, కుటుంబాలకు కుటుంబాలు, ఊళ్లకు ఊళ్లు ఇరుక్కుపోతాయి, అందరూ జైలుకు వెళ్లాల్సి వస్తుంది లేదా వేరే రాష్ట్రాలకు పారిపోయి దాక్కోవాల్సి వస్తుంది.

రెండు మూడు రోజుల క్రితమే ఒక తాజా కేసు వెలుగులోకి వచ్చింది. ఒక వ్యక్తి 20 ఏళ్ల తర్వాత జైలు నుండి నిర్దోషిగా విడుదలయ్యాడు. 23 ఏళ్ల వయసులో అతనిపై ఎస్సీ/ఎస్టీ చట్టం పెట్టారు, 20 ఏళ్లు జైల్లోనే గడిపాడు, ఆ తర్వాత కోర్టు అతను నిర్దోషి అని, అతనిపై కేసే నిలవదని తేల్చింది.

▪ మరి రాహుల్ గాంధీ విషయంలో కూడా అలాగే జరుగుతుందా?. 20 ఏళ్ల మాట పక్కన పెట్టండి, కనీసం 20 నిమిషాలైనా ఆయనను అరెస్ట్ చేస్తారా అనేది ఇక్కడ ప్రశ్న.

ఎస్సీ/ఎస్టీ చట్టంలో అరెస్టులు ఎలా ఉంటాయో గ్రామాల్లోకి వెళ్లి ప్రజలను అడిగితే తెలుస్తుంది.

**అదే చట్టం, అదే విచారణ రాహుల్ గాంధీకి కూడా వర్తిస్తుందా?. రాహుల్ గాంధీ కూడా ఎస్సీ/ఎస్టీ కేసులో జైలుకు వెళ్లాల్సి వస్తుందా? అనేది రాబోయే రోజుల్లో ఒక పెద్ద ప్రశ్న.**

ఒకవేళ ఆయన జైలుకు వెళ్లకపోతే ఎందుకు వెళ్లరు? ఆయనను అరెస్ట్ చేయకపోతే ఎందుకు చేయరు?. ఎస్సీ/ఎస్టీ చట్టం పేద ప్రజలకు ఒకలా, రాహుల్ గాంధీ లాంటి పీఠాలపై ఉన్న ప్రభావవంతమైన వ్యక్తులకు ఇంకోలా ఉంటుందా?

ఒక సామాన్య పౌరుడి పట్ల పోలీసులు ఎలా ప్రవర్తిస్తారో, రాహుల్ గాంధీ పట్ల కూడా అలాగే ప్రవర్తిస్తారా అనేది దేశం ముందున్న ప్రశ్న.

దీని ద్వారానే మన దేశంలో చెప్పబడే 'రాజ్యాంగం మరియు చట్టం ముందు అందరూ సమానమే' అనే మాట నిజమా కాదా అనేది తెలుస్తుంది.

▪ ఒకవేళ అందరూ సమానమైతే, రాహుల్ గాంధీ ఇప్పటికీ జైల్లో ఉండాలి, ఇప్పటివరకు లేకపోయినా 24 గంటల్లోనైనా జైలుకు వెళ్లాలి. ఒకవేళ రాహుల్ గాంధీ జైలుకు వెళ్లకపోతే, మరి మిగిలిన వారిని ఎందుకు పంపుతున్నారు? ఒకే చట్టం ఆధారంగా ఇద్దరు వ్యక్తుల పట్ల వేర్వేరు వైఖరి ఎలా సాధ్యం?

రాహుల్ గాంధీకి ఈ పరిణామం అస్సలు ఊహించి ఉండరు. ఈ అంశాన్ని లేవనెత్తితే తమ రాజకీయం వెలుగుతుందనుకున్నారు.బిజెపిపై దాడి చేయవచ్చని భావించారు. ఆయన ప్రతిపక్ష నేత కాబట్టి బిజెపిపై దాడి చేయడం ఆయన పని, కానీ కనీసం తనకు అవగాహన ఉన్న, ఏదైనా బలమైన ఆధారం ఉన్న ముద్దను ఎంచుకోవాలి కదా.

▪ అక్కడ జరిగిన శుద్ధీకరణ కార్యక్రమానికి దళిత అవమానంతో ఎలాంటి సంబంధం లేదు, ఎస్సీ/ఎస్టీ చట్టం కింద అది నేరం కూడా కాదు. ఎందుకంటే ఆ శుద్ధీకరణ కార్యక్రమం చేసిన వ్యక్తే స్వయంగా ఒక దళితుడు.

**ఎవరి గురించి అయితే దళితుడనే కారణంతో శుద్ధీకరణ జరిగిందని అంటున్నారో, అంటే మల్లికార్జున ఖర్గే గారి గురించి... ఆయన అసలు దళితుడా లేక బౌద్ధుడా అనే దానిపై స్పష్టత లేదు. ఒకవేళ ఆయన బౌద్ధమతం స్వీకరించి, ప్రాక్టీసింగ్ బుద్ధిస్ట్‌గా ఉంటే, మరి ఆయన దళితుడు ఎలా అవుతారు? దళితుడైతే బౌద్ధుడు ఎలా అవుతారు? ఈ చిక్కుముడి విప్పడం చాలా ముఖ్యం.**

▪ రాహుల్ గాంధీ పైన నమోదైన ఎఫ్ఐఆర్ రెండు పెద్ద ప్రశ్నలను లేవనెత్తింది. ఒకటి -- మల్లికార్జున ఖర్గే అసలు గుర్తింపు ఏమిటి?.... రెండు -- దేశ చట్టం సామాన్యుడికి వర్తించినట్టే రాహుల్ గాంధీకి కూడా వర్తిస్తుందా?

▪ రాబోయే రోజుల్లో ఇవి పెద్ద రాజకీయ అంశాలు కానున్నాయి. పెద్ద మనుషులు, ప్రభావవంతమైన వ్యక్తులు అయితే చట్టం వేరేలా వర్తిస్తుందనే ఆటలు ఇకపై సాగవు.

రాహుల్ గాంధీ మరియు అతని లాంటి వాళ్ళు ఈ దేశంలో ఉన్న రాజ్యాంగం, చట్టాలు సామాన్య ప్రజల కోసమే కానీ తమ కోసం కాదు, తాము వీటన్నింటికీ అతీతులం అని భావిస్తుంటారు.

తమను ముట్టుకునే వారెవరు అనే అహంకారం గత 12 ఏళ్లలో కొంతవరకు తగ్గినా, పూర్తిగా తొలగిపోలేదు.
ఈ ఎఫ్ఐఆర్ తర్వాత ఆయన అరెస్ట్ జరిగితే, చట్టం ముందు అందరూ సమానమే అనే సందేశం దేశమంతటా వెళుతుంది.

ఒకవేళ అరెస్ట్ జరగకపోతే, చట్టం పెద్దలకు ఒకలా, సామాన్యుడికి ఒకలా ఉందని అర్థమవుతుంది.

ఈ సవాలు ఇప్పుడు కేవలం ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం ముందే కాదు, న్యాయవ్యవస్థ ముందు కూడా ఉంది.

ఈ అంశం కచ్చితంగా కోర్టుకు వెళుతుంది. అప్పుడు న్యాయస్థానం వైఖరి ఎలా ఉంటుంది, సామాన్యుడిపై ఎస్సీ/ఎస్టీ కేసు పెట్టినప్పుడు ఉండే వైఖరే రాహుల్ గాంధీ పట్ల కూడా ఉంటుందా?

ఆయనకు కూడా అదే రకమైన ట్రీట్మెంట్ లభిస్తుందా? అనేది రాబోయే రోజుల్లో ఈ చట్టానికి ఒక కొత్త దిశను చూపే పెద్ద ప్రశ్న.

**మొత్తానికి.. రాహుల్ గాంధీ వ్యవహార శైలి తో కాంగ్రెస్ హిందూ వ్యతిరేక పార్టీ అని భారతీయులందరికీ ఒక స్పష్టమైన అభిప్రాయం బలపడుతున్నది.**

కరపత్రం తెలుగు దిన పత్రిక

బుధవారం సెప్టెంబర్ 02, 2026

# 1000 రోజుల్లో తెలంగాణ అభివృద్ధికి నూతన దిశ

- సంక్షేమం, అభివృద్ధితో ప్రజల గుండెల్లో కాంగ్రెస్
- వెయ్యి రోజులు.. తెలంగాణ ప్రగతిలో కొత్త అధ్యాయం
- వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

కరపత్రం ప్రతినిధి బ్యూరో, సెప్టెంబర్ 1

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజుల ప్రజాపాలనను విజయవంతంగా పూర్తిచేసుకుని నూతన దిశకు నాంది పలికిందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. మంగళవారం హనుమకొండలోని డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. ఈ 1000 రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత కాంగ్రెస్ శ్రేణులపై ఉందన్నారు.

**▪ రైతే రాజు.. రైతు సంక్షేమమే ధ్యేయం**

కాంగ్రెస్ ప్రభుత్వం గత 32 నెలల్లో రైతుల కోసం రూ.1.68 లక్షల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. హామీ మేరకు రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేసి 25 లక్షల రైతు కుటుంబాలకు రుణవిముక్తి కల్పించామని చెప్పారు. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు విడుదల చేయగా, కేవలం 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని పేర్కొన్నారు. సన్నబియ్యం సాగును ప్రోత్సహించేందుకు క్వింటాలుకు రూ.500 బోనస్‌తో పాటు ఉచిత విద్యుత్, రైతు బీమా పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. యాసంగి సీజన్‌లో 81 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి, ధాన్యం ఉత్పత్తిలో పంజాబ్‌ను అధిగమించి తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు.

**▪ మహిళలకు ఆర్థిక భరోసా**

మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కావ్య అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఇప్పటివరకు రూ.11 వేల కోట్ల ప్రయాణ వ్యయం ఆదా అయిందన్నారు. గృహజ్యోతి ద్వారా 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం ద్వారా 43 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూరిందని తెలిపారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 4.50 లక్షల స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.60 వేల కోట్ల రుణాలు అందించామని చెప్పారు. మహిళా సంఘాలకు సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సుల నిర్వహణ వంటి అవకాశాలను కల్పిస్తున్నామని వివరించారు.

**▪ పేదలకు సంక్షేమం.. సామాజిక న్యాయానికి పెద్దపీట**

15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేసి మొత్తం 3.38 కోట్ల మందికి పీడీఎస్ ద్వారా లబ్ధి అందిస్తున్నామని తెలిపారు. 43 లక్షల మందికి పైగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు అందిస్తున్నామని, మరో 2.25 లక్షల మందికి కొత్తగా






పెన్షన్లు మంజూరు చేశామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా తొలి విడతలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టి, ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల టవర్లు, వరంగల్‌లో టవర్ ఫ్లాట్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.

**▪ బీసీ కులగణన.. సామాజిక న్యాయానికి చారిత్రక అడుగు**

దేశంలోనే తొలిసారిగా బీసీ కులగణన పూర్తి చేసి, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపామని కావ్య తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అమలుకు కూడా అసెంబ్లీలో తీర్మానం చేశామని చెప్పారు. 12 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల సవరణతో 1.11 కోట్ల మంది కార్మికులకు ప్రయోజనం కలిగిందన్నారు. గిగ్ వర్కర్లకు చట్టబద్ధ గుర్తింపు కల్పిస్తూ ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేశామని తెలిపారు.

**▪ విద్య, ఉద్యోగాలు, వైద్యానికి ప్రాధాన్యత**

తెలంగాణ విద్యా రంగం పనితీరు మెరుగుపడి పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో 28వ స్థానం నుంచి 18వ స్థానానికి చేరిందన్నారు. ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని చెప్పారు. మెగా డీఎస్సీ ద్వారా 10 వేల ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశామని, తొలి 1000 రోజుల్లోనే 72 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పూర్తి చేశామని తెలిపారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని చెప్పారు. గోషామహల్‌లో రూ.2,700 కోట్లతో 2 వేల పడకల ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం చేపట్టామని, నిమ్స్‌లో 2 వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు.

**▪ రాష్ట్ర ప్రయోజనాలే కాంగ్రెస్ లక్ష్యం**

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ ఆర్థికంగా తీవ్ర సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య అన్నారు. గత ప్రభుత్వాలు సాధించలేని అనేక అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం వేగంగా పూర్తి చేస్తోందన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు ప్రభుత్వంపై అవాస్తవాలు ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా తెలంగాణపై వివక్ష చూపుతోందని ఆరోపించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులు, విభజన హామీలను అమలు చేస్తే తెలంగాణ అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని అన్నారు.

**▪ కాంగ్రెస్‌కు పెరుగుతున్న ప్రజాదరణ**

ప్రతిపక్షాలు ఎన్ని అవాస్తవాలు ప్రచారం చేసినా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం రోజురోజుకూ పెరుగుతోందని ఎంపీ డా. కావ్య అన్నారు. రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, దేశంలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో హనుమకొండ డిసిసి కమిటీ అధ్యక్షులు ఇనుగాల వెంకట్రాంరెడ్డి, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, తాజా మాజీ కార్పొరేటర్లు, మహిళా నాయకురాళ్ళు తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ టూకీ వార్తలు




కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి

మేడ్చల్ జిల్లాలో నిన్న సెప్టెంబర్ 1, 2026 రోజున జరిగిన ప్రధాన తాజా వార్తల అప్‌డేట్స్.

### ORR పై ఘోర ప్రమాదం

మేడ్చల్ ఔటర్ రింగ్ రోడ్డు (ORR) పై వర్షం పడుతున్న సమయంలో లారీపై టార్పాలిన్ కడుతున్న ఒక వ్యక్తిని, వెనుక నుండి వచ్చిన మరొక లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బీహార్‌కు చెందిన సదరు వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తాళం

మేడ్చల్ పరిధిలోని ఒక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ భవనానికి దాదాపు మూడేళ్లుగా అద్దె బకాయిలు చెల్లించకపోవడంతో, భవన యజమాని స్టేషన్‌కు తాళం వేసినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి.

### రాజీవ్ రహదారి ఎలివేటెడ్ కారిడార్ భూసేకరణ

పారడైజ్ జంక్షన్ నుండి శామీర్‌పేట్ ఓఆర్ఆర్ జంక్షన్ వరకు నిర్మించ తలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ కోసం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా తుంకుంట గ్రామ పరిధిలోని భూముల సేకరణకు సంబంధించి ప్రభుత్వం ఫారమ్-ఎ×× ప్రకటనను ఆమోదించింది.

### బీజేపీ జిల్లా కార్యాలయ ప్రారంభం

షాపూర్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బీజేపీ కార్యాలయాన్ని తెలంగాణ రాష్ట్ర బీజేపీ నాయకులు శ్రీ ఎన్. రాంచందర్ రావు మరియు స్థానిక మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ ఈటల రాజేందర్ ఈ నూతన కార్యాలయాన్ని మొన్న ప్రారంభించారు.మేడ్చల్ అర్బన్ జిల్లా పార్టీ అధ్యక్షులు మరియు స్థానిక బీజేపీ ముఖ్య నేతలు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు.

### మండల స్థాయి క్రీడా పోటీలు

జిల్లాలోని దివ్యాంగ బాలబాలికల ప్రతిభను ప్రోత్సహించడానికి వివిధ మండలాల్లో ప్రత్యేక క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు.

## కోరుట్ల నియోజకవర్గ సంక్షిప్త వార్తలు

గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి

### భవన ప్రారంభోత్సవం

కోరుట్ల పట్టణ శివారులోని కొనరావుపేట రోడ్డులో 50 లక్షల సీఎస్ఆర్ (CSR) నిధులతో నిర్మించిన పద్మశాలీ సంఘ భవనాన్ని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల మరియు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు కలిసి 2026 సెప్టెంబర్ 1న మంగళవారం రోజున ప్రారంభించారు.
అభివృద్ధి పనులు మెట్‌పల్లి పట్టణంలోని 8వ వార్డులో 2 లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల శంకుస్థాపన చేశారు.

### నూతన తహసీల్దార్ బాధ్యతలు

మెట్‌పల్లి నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ముఫ్తార్ పాషా, ఎమ్మెల్యే సంజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

### శిలాఫలకం వివాదం

మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్ కార్యాలయ భవన నిర్మాణ శంకుస్థాపన శిలాఫలకంపై కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ పేరు కింద పొరపాటున "మెట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే" అని ముద్రించడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

### మెట్ట పంటల సాగు

తక్కువ నీటి లభ్యత ఉన్నందున భూగర్భ జలాలను దృష్టిలో ఉంచుకుని రైతులు మెట్ట పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుట్ల మండల వ్యవసాయ అధికారిణి (ఊూ) నాగమణి సూచించారు.

### నైపుణ్యాల వర్క్‌షాప్

కోరుట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల కోసం 21వ శతాబ్దపు నైపుణ్యాలపై ప్రత్యేక వర్క్‌షాప్‌ను ప్రారంభించారు.

### పోలీస్ సస్పెన్షన్ వివాదం

మెట్‌పల్లి పరిధిలో దళిత మహిళ హత్య కేసులో విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలపై సస్పెండ్ అయిన కోరుట్ల ఎస్ఐ చిరంజీవిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని పలు దళిత సంఘాల నాయకులు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు.

### అక్రమ మద్యం సీజ్

మెట్‌పల్లి సమీపంలోని కథలాపూర్ మండలంలో సినిమా తరహాలో సీక్రెట్ కంపార్ట్‌మెంట్ వాహనంలో తరలిస్తున్న 70 బాక్సుల అక్రమ మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్ట్ చేశారు.

### ప్రభుత్వ ఆసుపత్రిలో ఆందోళన

మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తమకు మృతశిశువు జన్మించిందని ఆరోపిస్తూ బాధితురాలి కుటుంబ సభ్యులు ఆస్పత్రి వద్ద, జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహించారు.

## ఎన్‌హెచ్-44 రేకుల బావి వద్ద బోల్తాపడిన మినీ ట్రక్



కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి

మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్‌హెచ్-44 రేకులబావి సమీపంలోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద మంగళవారం కట్టెల లోడుతో వెళ్తున్న టూ07ఖజీ6689 నంబర్ గల అశోక్ లేలాండ్ మినీ ట్రక్ అదుపుతప్పి బోల్తాపడింది.
దీంతో లారీలో ఉన్న కట్టెలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని సమాచారం.
రోడ్డుపై కట్టెలు పడటంతో వాహనాల రాకపోకలకు స్వల్ప అంతరాయం ఏర్పడింది.
ఘటనపై మేడ్చల్ ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు.

## కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన జెడ్పీ సీఈఓ

కరపత్రం ప్రతినిది వరంగల్,సెప్టెంబర్ 1

జిల్లా పరిషత్ సీఈఓగా బాధ్యతలు స్వీకరించిన ఎన్.వసంత మంగళవారం కలెక్టర్ డాక్టర్ సత్యశారదను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.జిల్లా పరిపాలనలో సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

## పునరుద్ధరించిన మద్దివార్లు గోశాల ప్రారంభం: జీవీవైఏ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు

కరపత్రం ప్రతినిది హైదరాబాద్, సెప్టెంబర్ 1

గ్రేటర్ వైశ్య యూత్ అసోసియేషన్ (జీవీవైఏ) ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని శివాలయం మద్దివార్లు (మంచిదేవుని) ఆలయ గోశాల పునరుద్ధరణ పనులు పూర్తిచేసి, నూతన వసతులతో పునఃప్రారంభించారు. గోవుల సంక్షేమం, మెరుగైన సంరక్షణే ధ్యేయంగా జీవీవైఏ చేపట్టిన ఈ ప్రాజెక్టులో భాగంగా నూతన ఫ్లోరింగ్‌తో పాటు పటిష్టమైన ఇనుప నిర్మాణాలను ఏర్పాటు చేశారు.
ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జేసీఐ (జె సి ఐ) ఇండియా మాజీ జాతీయ అధ్యక్షుడు శిరీష్ దండూ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శివాలయం శ్రీ మద్దివార్లు గోశాల వ్యవస్థాపక అధ్యక్షుడు చిరికల్లి గోపాల్ గురుస్వామి, వాసవి గోగ్రాస స్వస్థ సహాయ నిధి ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ పోకాల నరేశ్వర్ రావు, జీవీవైఏ మాజీ అధ్యక్షుడు వివేక్ యాస్కీ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. గోసంరక్షణ, సేవా కార్యక్రమాల్లో యువత మరింత చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. జీవీవైఏ చేపట్టిన గోసేవా కార్యక్రమాలను వారు ప్రత్యేకంగా కొనియాడారు.
కార్యక్రమంలో భాగంగా గణపతి హోమం, శివ-హనుమాన్ పూజలు, సంప్రదాయబద్ధంగా గోపూజ నిర్వహించి గోశాలను ప్రారంభించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.
జీవీవైఏ అధ్యక్షుడు కార్తీక్ కుమార్ పెద్ది మాట్లాడుతూ.. సమాజ సేవలో గోసేవ అత్యంత ముఖ్యమైన భాగమని, భవిష్యత్తులోనూ గోవుల సంక్షేమానికి మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రాజెక్టు విజయవంతానికి కృషి చేసిన ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో జీవీవైఏ ప్రధాన కార్యదర్శి త్రినాథ్ యెదవల్లి, కోశాధికారి ప్రవీణ్ తల్లాడ, ప్రాజెక్ట్ కమిటీ సభ్యులు వినయ్ కుమార్ గుగ్గిళ్ల, చైతన్య కుమార్ వంకాయల, వెంకటేష్ పొలా, సాయిరాం వుప్పల, కేశవరాజు మురారిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అదనపు కలెక్టర్

కరపత్రం ప్రతినిది వరంగల్,సెప్టెంబర్ 1

వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా బాధ్యతలు స్వీకరించిన ఎల్.కిషోర్ కుమార్ మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదను మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ




సందర్భంగా కలెక్టర్‌కు పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం జిల్లాలో రెవెన్యూ పరిపాలనకు సంబంధించిన అంశాలపై చర్చించారు.జిల్లా పరిపాలనలో సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.